బుధేరా మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల గ్రంథాలయ భవనం

పైనున్న గోడపై రాసిన రాతలు ఎక్కడై ఉంటుందో ఒకసారి ఊహించండి.. బస్టాండో.. రైల్వేస్టేషనో.. లేక, సులభ్ కాంప్లెక్స్‌ల వద్ద రాసిన పిచ్చి రాతలు, గీతలు అనుకుంటున్నారా..? అలా అనుకుంటే మీరు పొరబడినట్లే.. ఇది ఒక మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల. పేద విద్యార్థులకు ఉన్నత విద్యనందించేందుకు, వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేందుకు కేసీఆర్ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించిన కళాశాలల్లో ఇదీ ఒకటి.. మునిపల్లి మండలం బుధేరా శివారులోని మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల. మెరుగైన విద్యనందించేందుకు గ్రంథాలయ భవనాన్ని నిర్మించి విద్యార్థినులకు అందుబాటులో ఉంచారు. ఈ గ్రంథాలయ గోడలపై గుర్తు తెలియని వ్యక్తులు తప్పుడు రాతలు రాశారు. 'కాల్ మీ' అంటూ ఫోన్ నంబర్లు, లవ్ సింబళ్లు దించారు.

గోడలపై తప్పుడు రాతలు.. తప్పని వెతలు

- మందు బాబులకు అడ్డాగా మునిపల్లి మండలం బుధేరా మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల
- ప్రహరీ లేక రక్షణ కరువు.. పట్టించుకోని అధికారులు
- ధ్వంసం అవుతున్న గ్రంథాలయ సామగ్రి

మహిళా డిగ్రీ కళాశాలలో కాల్ మీ!

ఈ పక్కనున్న ఫొటోను ఒకసారి చూడండి.. రాయితో గురిపెట్టి కొట్టినట్లు అన్ని కిటికీల అద్దాలు పగిలిపోయి కనిపిస్తున్నాయి కదూ.. ఇదీ అదే బుధేరా మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలనే.. ఇంత అధ్వానంగా తయారైనా ఎవరూ పట్టించుకున్న పాపాన పోవడం లేదు. కళాశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో రక్షణ కరువైంది. హాస్టల్‌కు ఎప్పుడు, ఎవరు వస్తున్నారో.. ఎప్పుడు పోతున్నారో ఎవరికీ తెలియని పరిస్థితి. దీంతో విద్యార్థినులు బిక్కుబిక్కుమంటూ విద్యనభ్యసిస్తున్నారు.

మునిపల్లి, డిసెంబర్ 26: మండలంలోని బుధేరా చౌరస్తాలోని మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థినుల కోసం నిర్మించిన గ్రంథాలయ భవనం మందుబాబులకు అడ్డాగా మారింది. గ్రంథాలయ పరిసర ప్రాంతాల్లో పెన్నిళ్లతో ఇష్టానుసారంగా తప్పుడు రాతలు రాశారు. ఫోన్ నంబర్లు రాశారు. గ్రంథాలయ భవనం చుట్టూ మందు బాబులు తాగి పడేసిన మద్యం బాటిళ్ల పచ్చలు కనిపిస్తున్నాయి. గ్రంథాలయ భవనం కిటికీలను ధ్వంసం చేశారు. సీసీ కెమెరాలు పని చేస్తున్నా సంబంధిత కళాశాల సిబ్బంది ఎందుకు పట్టించుకోవడం లేదని విద్యార్థినుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇంత జరుగుతున్నా కళాశాల సిబ్బంది, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. అటువైపు కన్నెత్తి చూడకపోవడం విడ్డూరమని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, కళాశాల సిబ్బంది స్పందించి నిఘా పెంచి విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

జహీరాబాద్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు

జహీరాబాద్, డిసెంబర్ 26: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం జహీరాబాద్ పట్టణంలోని దళిత సంఘాలు ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా దళిత సంఘాల నాయకులు, దళితులు కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్‌లో అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి వెంటనే జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నాలా కబ్జాను పరిశీలించిన అధికారులు

ముత్తంగి నాలా కబ్జాను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారి నవోద్‌రెడ్డి

పటాన్‌చెరు, డిసెంబర్ 26: ముత్తంగిలో కబ్జాకు గురవుతున్న నాలాను మున్సిపల్ అధికారి పరిశీలించారు. పటాన్‌చెరు మండలం, తెల్లాపూర్ మున్సిపాలిటీలో విలీనమైన ముత్తంగి గ్రామంలో జాతీయ రహదారిపై కబ్జాకు గురవుతున్న నాలాను గురువారం మున్సిపల్ అధికారి నవోద్‌రెడ్డి పరిశీలించారు. కొత్తగా ఏర్పాటవుతున్న హోటల్ యాజమాన్యం, నాలాకు మరోపక్క ఉన్న పెట్రోల్ పంపు యాజమాన్యం పోచమ్మ చెరువు నాలాను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నాయని వచ్చిన సమాచారం మేరకు తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి ముత్తంగి వార్డు ఇన్‌చార్జి అధికారి నవోద్‌రెడ్డిని విచారణ చేసి రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. ఈ మేరకు నాలా ఉన్న సర్వే నంబర్లను అధికారులు గుర్తించారు. పోచమ్మ చెరువు నాలాను మూసివేసి నీళ్లు పోవడానికి రెండు ఫీట్ల పైప్ లైన్‌ను వేశారని తేల్చారు. ఒకప్పుడు పొలాలకు ఈ నాలాతోనే నీళ్లు అందేవని స్థానికులు విచారణలో తెలిపారు. హోటల్, పెట్రోల్ పంపు యాజమాన్యాలు నాలా దిశను మార్చి నీటి ప్రవాహానికి అడ్డంకి సృష్టించారని స్థానికులు చెప్పారు. హోటళ్ల నుంచి వస్తున్న మురుగును కాల్వలో కలిపేస్తుండటంతో కాల్వ మురికిగా మారిందని పేర్కొన్నారు. రెండు ఫీట్ల పైప్‌లైన్‌లో మురుగు పేరుకుపోతున్నదని చెప్పారు. నాలా కబ్జా చేసి వేసిన పైపులపై మట్టివేసి పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు. స్థానికులు చెప్పిన విషయాలను మున్సిపల్ అధికారి నమోదు చేసుకున్నారు. రెవెన్యూ యంత్రాం గం, హైడ్రా అధికారులతో కలసి నాలా ప్రవాహ తీరును పునరుద్ధరిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్‌కు వాస్తవ రిపోర్టును అందజేస్తానని నవోద్‌రెడ్డి తెలిపారు.

భూలక్ష్మమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, డిసెంబర్ 26: ఝరాసంగం మండలంలోని కొల్లూరు గ్రామంలోని భూలక్ష్మమ్మ ఆలయాన్ని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సందర్శించారు. గురువారం ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు సంగమేశ్వర్, బస్వరాజ్‌పాటిల్, పరమేశ్, కిషన్, నర్సింహులు, వెంకట్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు జహీరాబాద్‌కు బసవధర్మ పీఠాధిపతి రాక

జహీరాబాద్, డిసెంబర్ 26: జహీరాబాద్‌కు ఈ నెల 28న బసవ ధర్మ పీఠాధిపతి, మహిళా జగద్గురు డాక్టర్ గంగామాతాజీ రానున్నట్టు తెలంగాణ రాష్ట్రీయ బసవదళ్ అధ్యక్షుడు శంకర్‌పాటిల్ తెలిపారు. జహీరాబాద్ రాష్ట్రీయ బసవదళ్ ఆధ్వర్యంలో పట్టణంలోని దత్తగిరి కాలనీలోని బసవ మంటపంలో సాయంత్రం 6 గంటలకు జరిగే సమావేశానికి హాజరుకానున్నారు. జనవరి 13, 14, 15 తేదీల్లో కూడల సంఘంలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు లింగాయత్ సమాజ్ నాయకులు, కులస్తులు, భక్తులను ఆహ్వానించేందుకు మాతాజీ రానున్నారని పేర్కొన్నారు. లింగాయత్ సమాజ్ నాయకులు, కులస్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

వైభవంగా అయ్యప్ప స్వామి ఊరేగింపు

భెల్ వీధుల్లో అయ్యప్ప స్వామి ఊరేగింపు

రామచంద్రాపురం, డిసెంబర్ 26: బీహెచ్ఈఎల్‌లో అయ్యప్ప స్వామి ఊరేగింపు వైభవంగా జరిగింది. భెల్‌లోని పుర వీధుల గుండా సాగిన ఊరేగింపులో స్వామివారు అంబారీపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సంవత్సరం భెల్ అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి ఊరేగింపు వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ముందుగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ గురుస్వామి పరమేశ్వరన్‌పిళ్లై ఆధ్వర్యంలో స్వామి వారి ఊరేగింపు ప్రారంభించారు. స్వామి వారి ఊరేగింపు వేడుకలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి శరణుఘోషతో భెల్ వీధులన్ని మార్మోగాయి. అయ్యప్ప స్వాముల నృత్యాలు, భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామియే శరణం అయ్యప్ప అంటూ కీర్తిస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో భెల్ ఈడీ కేబీరాజా, ఆయల కమిటీ అధ్యక్షుడు ఎంపీవీ రమణ, అధికారులు, గురుస్వాములు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లకు ప్రగతిచక్రం అవార్డులు అందజేస్తున్న డీఎం జాకీర్‌హుస్సేన్

జహీరాబాద్, డిసెంబర్ 26: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆర్టీసీ డిపోనకు చెందిన డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది శాయశక్తులా కృషి చేయాలని జహీరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ అన్నారు. గురువారం స్థానిక డిపోలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన డ్రైవ ర్లు, కండక్టర్లకు ప్రగతిచక్రం అవార్డులు, నగ దు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లు సమన్వయంతో పనిచేస్తూ ఆర్టీసీ అదాయాన్ని పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. డిపో పరిధిలోని ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించడమే కాకుండా అవసరానికి అనుగుణంగా బస్సులు నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్టీసీ అధికారులు తిరుమలేశ్, గంగమణి, రాజు, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఎం,భూపాల్‌రెడ్డి

నిజాంపేట్, డిసెంబర్ 26: మండల కేంద్రానికి చెందిన వార్డు సభ్యుడు హట్కురి లక్ష్మాబాయి, నిలేరావు కుమారుడు వికాస్ ప్రమాదానికి గురై మృతిచెందాడు. గురువారం నారాయాణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ జగదీశ్వర్ చారి, నవాబ్‌పాటిల్, రామ్‌చందర్‌పాటిల్, రమేశ్, నర్సింహులు, దుర్గయ్య, ప్రవీణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

రాయికోడ్, డిసెంబర్ 26: రాయికోడ్ వీరభద్రేశ్వరస్వామి ఆలయ కమిటీని ఎన్నుకున్నట్లు ఆధికారులు తెలిపారు. గురువారం పాలకవర్గాన్ని నియమించినట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాయికోడ్ గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ప్రభాకర్‌రావు కులకర్ణికి ఆలయ కమిటీ చైర్మన్‌గా నియమించినట్లు పేర్కొన్నారు. కమిటీ సభ్యులుగా భీమన్న, బసంతరావు, విఠల్, కృష్ణవేణి, నర్సయ్య, దత్తు రెడ్డి, పూజారులుగా వీరేశంస్వామి, రాచ్చయ్యస్వామిని నియమించారు.

పరిశోధనా రంగాల్లో అవకాశాలు

పటాన్‌చెరు, డిసెంబర్ 26: ప్రజారోగ్యం, పరిశోధనా రంగాల్లో ఫార్మసీ విద్యార్థులకు అపార అవకాశాలు ఉన్నాయని అమెరికాలోని ఎమోరీ విశ్వవిద్యాలయ భారతీయ పరిశోధన, విద్యా ఆవిష్కరణల డైరెక్టర్ డాక్టర్ నిఖిల్ సింగ్లా అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ, హైదరాబాద్‌ను ఆయన నేతృత్వంలోని ప్రతినిధి బృందం గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా ఫార్మసీ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థుల విద్యా, వృత్తిపరమైన అం శాల్లో అంతర్జాతీయ అవకాశాలను పరిగణణలోకి తీసుకోవాలని సూచించారు. ఎమోరీ విశ్వవిద్యాలయంతో సహకారం కోసం ప్రయత్నిస్తున్నామని ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్ దాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమోరీ విశ్వవిద్యాలయం అడ్మిషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఐవోన్ ఫోసీ, స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివకుమార్, డాక్టర్ దాస్, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్యలు పట్టించుకోరా?

పారిశుధ్య సమస్యను చూపుతున్న సంఘ సేవకుడు ఆనంద్ కృష్ణారెడ్డి

బొల్లారం, డిసెంబర్ 26: పారిశుధ్య లోపంతో మున్సిపల్ ప్రజలు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నా మున్సిపల్ కమిషనర్ పట్టించుకోవడంలేదని సంఘ సేవకులు ఆనంద్ కృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 రోజులుగా మురుగు కాల్వలు పొంగిపొర్లుతున్నా మున్సిపల్ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని వాపోయారు. ఇదే కాల్వలో ఓ పారిశుధ్య కార్మికుడు మృతి చెందిన విషయాన్ని గుర్తుచేశారు. అయినా సమస్యను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మురుగు కాల్వ మీదుగా నిత్యం ఎంతోమంది చిన్నారులు, మహిళలు, వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారని, ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యపై ఇప్పటికే కమిషనర్‌కు వీడియోల రూపంలో ఫిర్యాదు చేశామన్నారు. కానీ, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సమస్యలు పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు, డిసెంబర్ 26: గ్రామాల అభివృద్ధిలో పరిశ్రమలు భాగస్వామ్యం కావడం అభినందనీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని రుద్రారం పరిధిలోని తోషిబా పరిశ్రమ సహకారంతో గురువారం రూ.కోటీ 8 లక్షలతో చేపట్టిన పల్లె దవాఖాన భవనం, మూడు ఆరో ప్లాంట్లను ప్రారంభించారు. అనంతరం రూ.60 లక్షల పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పల్లె దవాఖానలు ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. రుద్రారం గ్రామాభివృద్ధికి తోషిబా సంస్థ సహకారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాండు, మండల పంచాయతీ అధికారి హరిశంకర్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు హరిప్రసాద్ రెడ్డి, రాజు, వెంకన్న, తోషిబా సంస్థ ప్రతినిధి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

గజ్వేల్, డిసెంబర్ 26: రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతిచెందిన ఘటన ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డుపై చోటుచేసుకుంది. సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకా రం.. అక్కన్నపేట మండలం రామవరం గ్రామానికి చెందిన శివ కోడి పిల్లలను బీదర్‌కు టాటా ఏసీలో తీసుకెళ్తున్నాడు. అదే గ్రామానికి చెందిన స్నేహితుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సాయికుమార్‌రెడ్డిని తనతో పాటు తీసుకెళ్లుతున్నాడు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డు పక్కన హోటల్ వద్ద నిలిపి ఉన్న మరో టాటా ఏసీ వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో సాయికుమార్ రెడ్డి (22) మృతి చెందాడు. నిలిపిఉన్న వాహనంలో ఉన్న జగద్గిరిగుట్టకు చెందిన ప్రదీప్‌కు బలంగా గాయాలుకావడంతో వెంటనే అతడిని దవాఖానకు తరలించగా ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నది. మృతుడు సాయికుమార్‌రెడ్డి మరో నాలుగు రోజుల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరాల్సి ఉండగా, ఇంతలోనే మృత్యువు కబళించడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అంత్యక్రియలకు తక్షణ సాయం అందజేత

ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

గుమ్మడిదల, డిసెంబర్ 26: అంత్యక్రియలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. గురువారం మండలంలోని మంభాపూర్ గ్రామానికి చెందిన మద్దూరు భాషయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అంత్యక్రియల నిమిత్తం తక్షణసాయంగా రూ.5 వేలు అందజేశారు. మాజీ సర్పంచ్ కంజర్ల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ దయానంద్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారుడికి సన్మానం

బ్యాడ్మింటన్ క్రీడాకారుడు నవనీత్‌ను సన్మానిస్తున్న పారిశ్రామికవేత్తలు, స్థానికులు

రామచంద్రాపురం, డిసెంబర్ 26: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు నవనీత్‌ను పారిశ్రామికవేత్తలు, భెల్ ఉద్యోగులు, కాలనీవాసులు కలిసి సన్మానించారు. ఇటీవల బంగ్లాదేశ్‌లో మిక్స్‌డ్ డబుల్స్‌లో అద్భుతంగా రాణించి సిల్వర్ మెడల్ సాధించిన సందర్భంగా వారందరూ ఓల్డ్ ఎంఐజీలోని క్రీడాకారుడు నవనీత్ నివాసానికి వచ్చి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మున్ముందు బ్యాడ్మింటన్‌లో రాణించి దేశానికి, రాష్ట్రానికి గొప్ప పేరు తీసుకురావాలని, తమవంతు సహకారం అందిస్తామని భరోసా కల్పించారు. అంతర్జాతీయ స్థాయి బ్యాడ్మింటన్‌లో నవనీత్ రాణిస్తుండడం సంతోషంగా ఉన్నదని పేర్కొన్నారు. అనంతరం నవనీత్ తల్లిదండ్రులు అనంత, బీఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాడ్మింటన్‌లో అంతర్జాతీయ స్థాయిలో కుమారుడు రాణించడం చాలా ఆనందంగా ఉందన్నారు. నవనీత్ పట్టుదలే తనను ఈ స్థాయికి తెచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కుడా నవనీత్‌ని గుర్తించి ప్రోత్సహిస్తే బ్యాడ్మింటన్‌లో బంగారు పతకాన్ని సాధించి తెస్తాడని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వి.ఉమమహేశ్వర్‌రావు, వీరవల్లి అశ్వినీకుమార్, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, మునింద్ర, సాంబశివరావు, క్రీడాకారుడు సోదరి వర్షా తదితరులు ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

బొల్లారం డిసెంబర్ 26: జిన్నారం మండలం జంగంపేట గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ ద్వితీయ వార్షికోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో బీఆర్ఎస్ రాష్ట్ర యువత నాయకుడు వెంకటేశం గౌడ్, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ వెంకటయ్య పాల్గొన్నారు. మొదటిరోజు పూజల్లో రుద్ర హోమం, చండీ హోమం రేణుక ఎల్లమ్మ జమదగ్ని ఊరేగింపు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, నాయకులు భోజిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, బండి శ్రీకాంత్ గౌడ్, శంకరప్ప, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ భార్గవ్, చంద్రారెడ్డి, మహేష్, బండి మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జంగంపేట రేణుకా ఎల్లమ్మకు పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

PUBLIC NOTICE

It is to inform to the General Public that by client Mr. Penmetcha Ramesh Kumar, S/o. Late Penmetcha Perraju is entering into an agreement of sale with Smt. Netha Shobamma, W/o. Late Netha Gopal, Netha Ramya, D/o. Late Netha Gopal, Netha Rani, D/o. Late Netha Gopal for the purchase of agriculture land All that Piece and Parcel of Agricultural Dry land in Survey No. 60 , admeasuring an extent of Ac. 1-00 Gts., situated at Taddhanpalle Village, G.P., Chowtakur Mandal, Sangareddy District, T.S. and bounded by: North: 15 Feet wide Road, South: Part of Sy.No. 60 Land of Netha Nirmala, East: Part of Sy.No. 60 Land of Netha Shobamma, West: Sy.No. 59 Diwan Ananda Prakash and also with Netha Nirmala, W/o. Late Netha Durgaiah and Netha Varaprasad, S/o. Late Netha Durgaiah for the purchase of agriculture land All that Piece and Parcel of Agricultural Dry land in Survey No. 60, admeasuring an extent of Ac. 1-00 Gts., situated at TADDHANPALLE Village, G.P., CHOWTAKUR Mandal, Sangareddy District, T.S. and bounded by: North: 15 Feet wide Road, South: Part of Sy.No. 60 Land of Netha Prabhakar, East: Part of Sy.No. 60 Land of Netha Shobamma, West: Sy.No. 59 Land of Diwan Ananda Prakash and is willing to pay the sufficient advance sale consideration amount and the balance sale consideration is to be paid by my client at the time of registration. It is further informed that, if any person/persons are interested in claiming the title over the above said land, may contact the undersigned with documentary evidence within period of Five (5) days, failing which my client will proceed with the execution of Agreement sale deed in their favour and further continue with registration and no objections whatsoever will be entertained subsequently, hence public are beware of above transaction.

HENCE, THIS PUBLICATION

Sd/- G.SRIKANTH - Advocate

Office: H.No. 4-8-17/A, Mangeera Nagar Colony, Sangareddy Town & District, Telangana-502 001, **Ph: 9010118930.**